పెండింగ్ కేసుల పరిష్కారం

అచ్చంపేట: లోక్ ఆదాలత్ ద్వారా ఎన్నో ఏళ్లుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం లభిస్తుందని సివిల్ జడ్జి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి మాట్లాడారు. వివిధ రకాల 294 కేసులను పరిష్కరించడం ద్వారా రూ.17,83,50 రికవరీ చేయడం చేసినట్లు తెలిపారు.

కల్వకుర్తి టౌన్: పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం జాతీయ లోకఅదాలత్‌లో భాగంగా కోర్టులో పలు కేసులకు పరిష్కారం లభించింది. 100 క్రిమినల్‌కు సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో సీసీడీసీ కేసులు 23, సీఏడీసీ కేసులు 77 పరిష్కారం కాగా, రూ.1,29,500 జరిమానా వసూలయ్యాయి. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌కు సంబంధించి 663 కేసులు పరిష్కారం కాగా, అందులో 657 కేసులు ఎస్‌టీసీ కేసులకు గాను రూ.1,06,200 జరిమానాలు ఉండగా, బ్యాంకులకు సంబంధించి ఆరు కేసులకు గాను రూ.1,77,300 వసూలు అయ్యాయని కోర్టు అధికారులు తెలిపారు.


కల్వకుర్తిలో కేసుల పరిష్కారం చేస్తున్న జడ్జిలు

వెల్దండ: జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 136 కేసులను పరిష్కరించారని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్డుకు సంబంధించి 4 సివిల్, 21 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. 2వ అదనపు కోర్డుకు సంబంధించిన 812 క్రిమినల్ కేసులలో అపరాధ రుసుం రూ. 6,25,430 వసూలు అయ్యాయి. 2వ బెంచీలో, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన ఒక సివిల్, 43 క్రిమినల్ కేసులు పరిష్కరించబడ్డాయి.

‘ప్రజల చిరకాల కోరిక తీరనుంది’


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడూరు: పాలమూరు ప్రజల చిరకాల కోరిక ఈ నెల 16న నార్లాపూర్ రిజర్వాయర్ సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. పదేళ్ల ప్రజాప్రస్థానం పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచారన్నారు. ఎన్నికల సమయంలో కొబ్బరికాయలు కొట్టడానికే పరిమితం అయ్యారని విమర్శించారు. కాంగ్రెస్, టీడీపీలు కేసులు వేసి అడ్డు వేశారని ఏం మొఖం పెట్టుకొని ప్రాజెక్టుల సందర్శనకు వెళ్తారని విమర్శించారు. 2001లో కేసీఆర్ పాదయాత్రలో శంకుస్థాపన చేసిన విషయం ప్రజలకు తెలుసునన్నారు. ప్రాజెక్టును ఎవరు పూర్తి చేశారో తెలుసని కేవలం వారు వేసిన కేసులతోనే పనుల్లో జాప్యం కలిగిందన్నారు. 16న కలశాలతో గ్రామదేవతలకు అభిషేకం చేస్తామన్నారు. జూపల్లికృష్ణారావు కేసీఆర్‌ను గతంలో విజవరి నాయకుడు అన్నాడని ప్రస్తుతం విమర్శిస్తున్నాడని తెలిపారు. డీకే అరుణ, చిన్నారెడ్డివి అవగాహన లేని మాటలని ప్రాజెక్టులు, రైతులపై వారికి ప్రేమ లేదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సమ్మద్‌పాషా, జెక్కరఘునందన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసులు, గౌరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రజా సంక్షేమమే బిఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మర్రి అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి ఎండబెట్ల మీదుగా చర్లతిరుమలాపురం చేరుకుంది. ఆయన మాట్లాడుతూ గతంలో కేసరి సముద్రంలో నీరు ఉండేది కాదని ప్రస్తుతం 365 రోజులు చెరువు అలుగు పారుతుందన్నారు. ఈసారి తనను గెలిపిస్తే చెరువుకట్ట, ఎండబెట్ల వద్ద బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు

అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి టికెట్ కోసం శనివారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్‌మాదిగ తెలిపారు. 30ఏళ్ల నుంచి ప్రజా జీవితంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నానన్నారు.

పద్మశాలి కార్యవర్గం ఎన్నిక

దోమలపెంట: దోమలపెంటలోని భక్త మార్కండేయ శివాలయంలో శనివారం పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నామని సునీంధర్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, శేఖర్, నిర్వహణ కార్యదర్శులుగా దేవిరాము, అచ్చలయ్య, ఆఫీస్ కార్యదర్శులుగా సత్యనారాయణ, సుధాకర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్షుడు తెలిపారు.

హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తా

మన్ననూర్: మాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దివాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్రకటించిన మాల మహానాడు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

కోడేరులోనే కొనసాగించాలి



కోడేరు: తుర్కదిన్నె, ముత్తిరెడ్డిపల్లి గ్రామాలను కోడేరు మండలంలోనే కొనసాగించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటవుతున్న ఏదుల మండలాన్ని తమ గ్రామాలను కలపవద్దని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని అన్నారు.

నేడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఆదివారం నిర్వహించే నల్లమల నగారా బహిరంగ సభకు ముఖ్య అతిథిగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోత్కూర్ నాగార్జున తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాజ్యాధికారం కోసం పోరాటం చేద్దాం

అచ్చంపేట రూరల్: బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాటం చేద్దామని, రాజ్యాధికారం వస్తేనే బతుకులు మారుతాయని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోత్కూర్ నాగార్జున అన్నారు. శనివారం పట్టణంలోని మహేంద్రనగర్ కాలనీలోని సంచార జాతులకు సంబంధించిన వారితో సమావేశం నిర్వహించారు. కాలనీలో ఎలాంటి వసతులు లేవని, సంచార జాతులు ఉన్న ప్రాంతాలపై ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూడవద్దన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే సంచార జాతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, రాంచందర్, ఆనంద్, మల్లయ్య, ఈశ్వర్, జాకీర్, శేఖర్, సురేష్, బాలరాజు, శంకర్, హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి ప్రతిమల ఊరేగింపు



కందనూలు: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని న్యూటీచర్స్ కాలనీలో శ్రీకృష్ణుడి ప్రతిమలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు కాలనీలో కొలువైన శ్రీకృష్ణుడికి పూజలు, మహిళలు భజనలు చేశారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భ్రమరాంబ దేవాలయంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్లకోనేరు వద్ద యాదవులు పిరమిడ్ ఆకారంలో ఒకరిపై ఒకరు నిలబడి ఎత్తైన ఉట్టిని కొట్టారు. ఉట్టితాడును ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు లాగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నల్లపు శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పులతడకగా సీనియారిటీ జాబితా

కందనూలు: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా తప్పులతడకగా ఉన్నాయని, వాటిని తొలగించి సమగ్రమైన జాబితాను రూపొందించాలనీ టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరిలోనే పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల కాగా, ఫిబ్రవరి నెలలో ప్రతి ఉపాధ్యాయుడి సరీ్వసు పుస్తకాన్ని సమగ్రంగా పరిశీలించి, సీనియారిటీ జాబితాలు వెల్లడించారని, కానీ శుక్రవారం నుంచి డీఈఓ వెబ్‌సైట్‌లో అనేక తప్పులతో గంటకొక జాబితాను పొందుపరుస్తూ, తప్పుల సవరణకు శని, ఆదివారాలు రెండు రోజులు మాత్రమే అభ్యంతరాలు స్వీకరిస్తామనడం, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురి అవుతున్నారని విమర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జోక్యం చేసుకుని ఫిబ్రవరి నెలలో ప్రచురించిన జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచి, అందులో తిరిగి ఏమైనా అభ్యంతరాలుంటే సరిచేసేలా సిబ్బందిని ఆదేశించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందాలి



వెల్దండ: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంకమోనికుంట, జానలగట్టుతండాల్లో ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ ప్రభుత్వ పాలనలోనే దేశప్రజలందరూ సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, శశిధర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

తోడేళ్లగడ్డకు బస్సు

బల్మూర్: మండలంలోని తోడేళ్లగడ్డకు శనివారం అచ్చంపేట నుంచి బస్సు సర్వీసు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అచ్చంపేట, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే 3కిలోమీటర్ల దూరం వెళ్లి బస్సులు ఎక్కాల్సి వచ్చేదని, దీంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దృష్టికి శుక్రవారం తేవడంతో ఆయన వెంటనే స్పందించి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. తొలిసారిగా బస్సు రావడంతో గ్రామస్తులు బస్సు ముందు కొబ్బరికాయలు కొట్టారు.

ఊహకందని విధంగా అభివృద్ధి

అమ్రాబాద్: ప్రజల ఆశీస్సులు, ముఖ్యమంత్రి దీవెనలతో నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశానని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాలనలో అద్భుతమైన అభివృద్ధిని సాధించామని, రాబోయే రోజుల్లో ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించేందుకు ఈ నెల 16 ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్నారని రైతులు, పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చింది మేమే అని చెబుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ముచ్చటగా మూడో సారీ అధికారం బీఆర్‌ఎస్‌దేనని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలని ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం చేస్తున్నారని, డీబీర్స్ కంపెనీ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ భర్తదేనని అన్నారు. ఆయన వెంట రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు అలిపాషా తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు

అర్హులకు పోడు భూముల పట్టాలు..

లింగాల: అర్హులైన రైతులందరికీ పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం ఆయన అటవీ శాఖ అధికారులతో కలిసి మండలంలోని రాయవరం, క్యాంపురాయవరంలో పర్యటించారు. రాయవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయవరం, క్యాంపు రాయవరం శివారులలో ఉన్న సర్వే నెంబర్ 83లోని 1300 ఎకరాలకు సంబంధించి భూమిలో సమస్య నెలకొందని తెలిపారు. కొన్నేళ్ల నుంచి సాగు చేస్తున్న అటవీ శాఖ, రెవెన్యూ భూములకు సంబంధించి రైతులకు ఎలాంటి హక్కులు లేవని, పోడు భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దని రైతులను కోరారు. గతంలో ఇచ్చిన పట్టాలలో అనర్హులు ఉన్నారని, సాగులో లేని వారికి కూడా పట్టాలు ఇచ్చారని కొంత మంది రైతులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో మరోసారి పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని ప్రభుత్వ విప్ అన్నారు. పంచాయతీల తీర్మానాలు చేసి గుర్తించిన రైతుల జాబితాను అందజేస్తే అర్హులైన వారిని గుర్తిస్తామని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, ఎంపీడీఓ గీతాంజలి, ఎఫ్ఆర్ఓ వీరేశం, హన్మంత్‌రెడ్డి, శేషయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘గువ్వల’పై రౌడీషీట్ ఓపెన్ చేయాలి



మాట్లాడుతున్న వంశీకృష్ణ

కందనూలు: ఉమ్మడి జిల్లాలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి, అధికారాన్ని అడ్డంపెట్టుకోని ప్రజలు, అధికారులు, ప్రతిపక్ష నాయకులను బెదిరించడమే కాకుండా, కేసులు పెట్టి వేధిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఆయనకు సహకరించే లింగాల ఎస్‌ఐ శ్రీనివాస్‌పై వెంటనే రౌడీషీట్ ఓపెన్ చేసి, అరెస్ట్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గంలో గువ్వల బాలరాజు ఆగడాలకు హద్దేలేకుండా పోతుందని చెప్పారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా ప్రజాసమస్యలపై ధర్నా చేస్తున్న తమ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్‌తో పాటు మరో ఐదుగురిపై తప్పుడు కేసులు పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేయడం ఎంత వరకు సమంజసమో అర్థం కావడం లేదన్నారు. కనీసం ఏ విషయంలో రౌడీషీట్ ఓపెన్ చేస్తారో లింగాల ఎస్‌ఐ శ్రీనివాస్‌కి తెలియకపోవడం దారుణమన్నారు. గువ్వల బాలరాజు అడుగులకు, మడుగులు వత్తే వారే ఇలా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలు కేసులు పెడుతారని చెప్పారు. లింగాల ఎస్‌ఐ ప్రభుత్వ అధికారా? లేక బీఆర్‌ఎస్ మండల నాయకుడో తెలియడం లేదన్నారు. తమ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తానని చెప్పారు. సమావేశంలో రాజేందర్, హబీబ్, శ్రీనివాస్, కాషన్న యాదవ్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష దినోత్సవం



మన్ననూర్: ప్రజా కవి కాళోజి నారాయణరావ్ జయంతి సందర్భంగా స్థానిక పీటీజీ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలంగాణ మాతృ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుకు ప్రాధాన్యత ఇద్దాం, పరభాష మనకొద్దు తెలుగు భాషనే ముద్దు అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను చేతపట్టుకుని ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు.

దోమలపెంట: కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని శనివారం ఈగలపెంటలోని భూగర్భ కేంద్రం సీఈ పరిపాలన కార్యాలయం శక్తి సదన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలకపల్లి: తెలంగాణ తెలుగుభాష దినోత్సవం శనివారం మండల కేంద్రంలో సిద్దార్థ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

ఆరుగురిపై కేసు నమోదు

బల్మూర్: భూ తగాదా విషయంలో బెదిరించి డబ్బులు వసూలు చేసిన నేపథ్యంలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని రామాజిపల్లికి చెందిన మాధంశెట్టి రాములు, వేముల శివయ్య, బాలకిష్టయ్య, ఆవుల శ్రీను, మాదంశెట్టి రవి, వెంకటమ్మ భూ తగాదా విషయంలో బీసమ్మతో పాటు భర్త మురళిని బెదిరించి మీ కుమారులు గణేష్, శివపై పెట్టిన కేసు విషయంలో రాజీపడటం కోసం బెదిరించడంతో వారికి భయపడి రూ.1.67 లక్షలు ఇచ్చినట్లు బీసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలకు పర్మనెంట్ చేసి, రూ.26 వేల వేతనం ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం, గ్రాడ్యూటీ అమలు చేయాలన్నారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, చిన్నపాగ శ్రీనివాసులు, బాలమురళీకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలో 13న నిర్వహించే గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్ అలీఖాన్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని జక్క గోపాల్ కోరారు. శనివారం మన్ననూర్‌లోని అంబేద్కర్ గ్రంథాలయం ఆవరణలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గద్దర్ జీవించిన 75 ఏళ్లు పేద ప్రజల గొంతుకయ్యాడన్నారు. నల్లమల ప్రాంతం ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు యురేనియం వ్యతిరేక పోరాటంలో ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని ప్రజల గుండెల్లో ఆయన ఓ ప్రత్యేక స్థానం, అభిమానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఈ సంస్మరణ సభకు గద్దర్ కూతురు వెన్నెల, విమలక్క, ప్రొ.కాశీం, పాశం యాదగిరి, కర్ణాటక గద్దర్ తదితరుల సమక్షంలో గద్దరన్న ఆట, పాటలను స్మరించుకుంటూ నివాళి అర్పిస్తారన్నారు. మండలంలోని కవులు, కళాకారులు, ప్రజా, కుల, ఉపాధ్యాయ, ఉద్యోగ, అంబేద్కర్, విద్యార్థి, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాసరయ్య, రాంకోటి, బాలకిష్టయ్య, దివాకర్, అరుణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపాల్

దళితులపై దాడి అమానుషం


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తాడూరు: హైదరాబాద్‌లోని గండిపేట మండలం వట్టినాగులపల్లిలో బొడ్రాయి పండుగ సందర్భంగా బోనాల ఊరేగింపులో దళితులపై దాడి చేయడం హేయమైన చర్య అని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ శనివారం ఖండించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దళితుల బోనాలను వెనక్కి పంపించడం విడ్డూరమైన చర్య అని అన్నారు. దళితులపై వివక్షత, అంటరానితనం ప్రధాన పట్టణాలలో ఈ విధంగా ఉంటే గ్రామీణ ప్రాంతాలలో జీవించే దళితులు ఏవిధంగా మనుగడ సాధించగలుగుతారని వాపోయారు. ఇందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మశన్న, బాలరాజు, వెంకటయ్య, కాశన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

కందనూలు: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలో బోనాలు ఎత్తి నిరసనలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 8వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు బోనమెత్తి, సీఎం కేసీఆర్ చిత్రపటంతో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి, విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు పదరా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లో న్యాయం ఉందని, తమ ఇబ్బందులను అర్థం చేసుకుని ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు.


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

శనైశ్వరున్ని దర్శించుకున్న కొండగట్టు డీసీ

బిజినేపల్లి: మండలంలోని నంది వడ్డెమాన్ శనేశ్వరున్ని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి డీసీని ప్రత్యేకంగా ఆహ్వానించి శనైశ్వరునికి తిలతైలాభిషేక పూజలు, శివునికి రుద్రాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని పూజలు నిర్వహించారు.

ఓటరు నమోదు అవగాహన కల్పించండి

పెంట్లవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఓలతో తహసీల్దార్ మహ్మద్ జమీల్ శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు గ్రామాలలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం


కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. శనివారం షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేశారు. మున్సిపల్ చైర్మెన్ ఎడ్మసత్యం ఆధ్వర్యంలో క్రీడాకారులు ఎమ్మెల్యేను కలువడంతో స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు.

ముందస్తు అరెస్ట్



సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండల కాంగ్రెస్ నాయకులను శనివారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సందర్శనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. పలువురు మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు పరిశీలించేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ ఈనెల 16న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించడానికి వస్తున్నారని పనులు పూర్తికాక ముందే ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


గువ్వలోనిపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

మన్ననూర్: మేదరి కులస్తుల కులదైవం మలలమ్మ తల్లి వార్షిక ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి చెరువు కొమ్ము లింగమయ్య చెక్‌పోస్టు సమీపంలో కొలువుదీరిన మలలమ్మ అమ్మవారికి ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమం..

చారకొండ: ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శనివారం హోమంలో సతీసమేతంగా పలువురు పాల్గొన్నారు. పురోహితులు వేద మంత్రోచ్చరణలతో హోమం నిర్వహించి, పూర్ణాహుతి గావించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

చెన్నయ్య ఆలయంలో పూజలు..

మండలంలోని జూపల్లిలో శ్రావణ మాసం నాల్గవ శనివారం సందర్భంగా చెన్నయ ఆలయంలో శనివారం గ్రామస్తులు దేవాలయాన్ని అలంకరించి పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు పండాలని దేవునికి వరదపాశం నిర్వహించారు.

జూపల్లిలో పోచమ్మ బోనాలు..


జూపల్లిలో పోచమ్మ బోనాల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారులకు తోరణాలు కట్టి, దేవాలయాన్ని అలంకరించారు. డప్పు వాయిద్యాలతో బోనాలతో మహిళలు ఊరేగింపు చేపట్టారు. బొడ్రాయి చుట్టు ప్రదక్షిణ, కోటమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ దేవాలయం చేరుకుని నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


జూపల్లిలో బోనాలతో ఉరేగింపుగా మహిళలు

వెల్దండ: మండలంలోని రాచూర్, గుండాలలో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చినారిపల్లిలో బోనాల పండుగ శనివారం నిర్వహించారు. గ్రామస్తులు బోనాలను పెద్ద ఎత్తున ఊరేగింపుగా అమ్మవారి దేవాలయం వద్దకు తీసుకువెళ్లి సమర్పించారు.

ఉప్పునుంతల: మండలంలోని గువ్వలోనిపల్లిలో శనివారం సాయంత్రం గ్రామస్తులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన బోనం కుండలను మహిళలు, యువతులు తలపై పెట్టుకొని మొదటగా అన్ని కాలనీల నుంచి గ్రామ కూడలి వద్దకు చేరుకున్నారు. బొడ్రాయి వద్ద పూజలు చేసిన అనంతరం గ్రామం వెలుపల ఉన్న పోచమ్మ గుడి వద్దకు చేరుకుని ప్రదక్షిణ చేశారు. కొంతమంది రైతులు పెంచిన మొలకల బుట్లను పోచమ్మ అమ్మవారికి సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


హోమం నిర్వహిస్తున్న భక్తులు